# ఎన్నికలకు 'ముందస్తు' సన్నాహాలు

**ఎన్నికలు** జరిగి అధికారంలోకి వచ్చిన పార్టీకి, మొదటి సంవత్సరమంతా విజయోత్సవాలతో సరి. చివరి సం॥ అంతా రానున్న ఎన్నికల కోసం పథకాలు, వాగ్దానాలు, కసరత్తులతో సరేసరి! కాగా, ఈ సారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలక, విపక్షాలు రెండూ, రెండు సం॥ల ముందు నుండే 2019 ఎన్నికలకు వ్యూహ, ప్రతివ్యూహాలతో సతమత మౌతున్నాయి.

ముప్ఫై మంది మంత్రులకు మోహరించీ, స్వయానా ముఖ్యమంత్రే ప్రచారం సాగించీ, తారా స్థాయిలో అధికార దుర్వినియోగానికి పాల్పడీ, ప్రజను ఎన్నో ప్రలోభాలకు గురిచేసీ, కోట్లరూపాలయను వరదలా పారించీ ..... చచ్చీనెడీ నందాల్య అసెంబ్లీస్థానాన్ని కైవసం చేసుకోవటాన్నే, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం పొందినంత ఘనంగా టిడిపి సంబరపడి పోతోంది. అధికారంలో లేకపోవటం మినహా, వైసీపీ కూడా పోటాపోటీగా ఈ చర్యలన్నిటికీ పాల్పడటం ద్వారా భ్రష్టవిలువల పార్లమెంటరీ ఎన్నకల డొల్లతనాన్ని రెండూ కలసి మరో సారి రుజువుచేశాయి.

అసెంబ్లీనియోజక వర్గ ఉప ఎన్నిక సాధారణంగా అధికార పక్షానికే అనుకూలంగా వుంటుందనీ, పై పెచ్చు అంతులేని అవినీతికి పాల్పడటం ద్వారానే టిడిపి అభ్యర్థి విజయం సాధించాడని వైసిపీ సమీక్ష చేస్తోంది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలలో గూడుకట్టుకున్న వ్యతిరేకత, రానున్న ఎన్నికలలో తమకు విజయాన్ని వరించి పెడుతుందని వైసిపీ లెక్కలు వేస్తోంది. ఎన్నికలలో గెలుపు కోసం 'వృత్తినిపుణుడైన వ్యూహకర్త' మార్గ నిర్దేశకత్వంలో 'వైయస్సార్ కుటుంబం' పేరున రాష్ట్ర వ్యాపితంగా ఇంటింటి ప్రచారం నిర్వహించటంతోపాటు, నవంబర్ 2న ప్రారంభించి ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు 180 రోజుల జగన్ భారీ పాదయాత్రకు ఏర్పాట్లను చేసుకుంటోంది.

నంద్యాల ఉపఎన్నిక ఉత్తేజంతో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలనూ కైవసం చేసుకునే విధంగా పాచికలు కదపాలని అధికార పక్షం బాహాటంగా ప్రకటిస్తోంది. రాష్ట్రంలోని ప్రజలంతా తమ వెంటే వున్నారంటూ చంద్రబాబు మార్కు గణాంకాలతో విశ్లేషణలను మీడియాకు వెల్లడిచేస్తోంది. దీనిని మరింత ముందుకు 'సంతృప్తస్థాయి'కి చేర్చటానికి 'గడపగడపకు టిడిపి'ని చేపట్టటంతోపాటుగా, ప్రజలందరి యోగక్షేమాలను విచారించాలని ఎక్కడలేని ప్రేమను ఒలకబోస్తోంది.

గత రెండు సంవత్సరాలలోనూ, రెండు విడతలుగా గృహవినియోగ విద్యుత్తు స్లాబ్‌లను, స్లాబ్‌రేట్లను సవరించటం ద్వారా, గృహ విద్యుత్తు వినియోగదారులపై వేలకోట్లరూ॥ భారాన్ని మోపిన తెలుగుదేశం ప్రభుత్వం, రానున్న రెండేళ్ళలో ప్రజలపై విద్యుత్తు ఛార్జీల భారం పైసాకూడా మోపబోమని 'దుర్గమ్మ' సాక్షిగా ప్రకటిస్తున్నామంటోంది.

రాష్ట్రంలో – వివిధ ప్రాజెక్టులు, పోర్టులు, పథకాల పేరిట లక్షలాది ఎకరాలను సేకరించిన ప్రభుత్వం, దీనితో నిరాశ్రయులైన లేదా విస్థాపనకు గురైన ప్రజానీకానికి సరైన పునరావాసం, పున:స్థాపన, పరిహారం కల్పించలేదు. ఈ డిమాండ్లపై ప్రజలు నిరంతరం ఆందోళనలు సాగిస్తున్నా, వానిని పెడ చెవిన పెట్టటమేగాక, నిర్బంధం ప్రయోగించి అణచివేతకు పాల్పడుతున్న చంద్రబాబునాయుడు ప్రభుత్వం, ఎన్నికల సన్నాహాలలో భాగంగా ఉచిత గృహాల పంపిణీ కార్యక్రమాన్ని ముందుకు తెచ్చింది. ప్రపంచ ఆవాస దినోత్సవం, గాంధీ జయంతిని పురస్కరించుకుని, అక్టోబర్ 2న రాష్ట్ర వ్యాపితంగా లక్షగృహాలను పేదలకు అందిస్తామని, 2018 సం॥లో రెండు, మూడు విడతల్లో మరో రెండు లక్షల ఇళ్ళను కట్టించి పేదలకు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు పట్టణ ప్రాంతాల్లో రెక్కలు ముక్కలు జేసుకునే శ్రమజీవులు, తలదాచుకోను గూడు కోసం కమ్యూనిస్టుపార్టీల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తమ స్వీయ కష్టార్జితంతోనే పేదల కాలనీలను ఏర్పాటుచేసుకొని నివాసముంటున్నారు. వీరంతా తమ నివాసస్థలాలపై తమకు హక్కు కల్పించాలని, తమ కాలనీలలో రోడ్లు, విద్యుత్తు, మంచినీరు, మురుగునీటి పారుదల వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని, దశాబ్దాలుగా ఆందోళనలు చేస్తున్నా, ప్రభుత్వాలేవీ వారి గోడు పట్టించుకోవటంలేదు. మరోవైపు పేదలకు ఉచితంగా ఇళ్ళు కట్టించి ఇస్తామని చెప్పటం, ఎవరిని మభ్యపెట్టటానికి?!

సదావర్తి భూములు అమ్మకంలోనూ, విశాఖజిల్లా భూముల కబ్జాలతోనూ వెల్లడైన పాలక పక్షం, రాష్ట్ర వ్యాపితంగా పట్టణ ప్రాంతాల్లో పేదల ఆక్రమణలోనున్న నివాస భూములను క్రమబద్ధీకరిస్తామని పేర్కొంది. ఈ ప్రకటన మేరకైనా, పేదల అనుభవంలోనున్న నివాసస్థలాలు ఎక్కడైనా పేదలకు దక్కాయా ? కావున, పట్టణ ప్రాంతాలలో భూముల క్రమబద్ధీకరణ నిర్ణయం, సంపన్నుల ఆక్రమిత భూములను చట్టబద్ధం చేయటానికే తప్ప, పేదలను ఉద్ధరించటానికి కాదని స్పష్టం కావటంలేదూ?!

'జాబురావాలంటే బాబు రావాలంటూ' గత ఎన్నికలలో విస్తృతప్రచారం చేసుకున్న తెలుగుదేశం పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఉద్యోగాలను కల్పించకపోగా, ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను సైతం భర్తీ చేయలేదు. పైగా వివిధ ప్రభుత్వశాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద సంఖ్యలో వీరిని తొలగించింది. ఉద్యోగం కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్న టిడిపి, మూడు స॥ల పాలన తర్వాత ఇప్పుడు దానిని అమలు చేయబోతున్నట్లుగా ప్రకటిస్తోంది. దీని కోసం రూపొందించిన విధివిధానాల ప్రకారం – ఉపాధిహామీపథకంలో జాబ్‌కార్డు ఉన్నవారంతా ఉద్యోగులేనట! ఏనాడో కాలంచెల్లిన 'ఎంప్లాయిమెంట్ ఎక్చ్సేంజి'లో నమోదు చేసుకున్నవారినే నిరుద్యోగులుగా

పరిగణించి వారికే నిరుద్యోగ భృతి (!) చెల్లిస్తారట! ఇలాంటి మరెన్నో పథకాలను ముందుకుతెస్తూ వివిధ సెక్షన్ల ప్రజలను భ్రమలలో ముంచెత్తటానికి అధికార పక్షం మోసపూరితంగా వ్యవహరిస్తోంది.

టిడిపి కూడా భాగస్వామ్యం వహించిన కేంద్ర ప్రభుత్వ 'పెద్దనోట్ల రద్దు', జిఎస్‌టి విధింపు నిర్ణయాలు ప్రజల జీవితాలపై మరిన్ని భారాలను మోపాయి. ఉపాధి అవకాశాలు తగ్గటంతోపాటు, వ్యవసాయ భూములు కోల్పోయి, వ్యవసాయం గిట్టుబాటుగాక, వలసలు పెరుగుతున్నాయి. పట్టణ కార్మికులపై పనిభారం పెరగటంతోపాటు, కనీస సౌకర్యాలు మృగ్యమై, వేతనాలలో కోత పెరుగుతోంది. దీనికి తోడు అదుపులేని నిత్యావసరాల ధరలు, దూరమౌతున్న విద్య – వైద్యం వంటి పలుసమస్యలతో ప్రజలు కొట్టు మిట్టాడుతున్నారు 'దోమలపై దండయాత్ర' ప్రభుత్వ ప్రచారార్భాటపు కార్యక్రమంగా మిగిలిపోయి, రాష్ట్ర వ్యాపితంగా జ్వరపీడితులతో ప్రభుత్వ ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. మలేరియా, ఇతర విషజ్వరాలతో ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల్లో మరణాల సంఖ్య పెరుగుతోంది.

నిత్యం తామెదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చైతన్యయుతంగా, సంఘటితంగానో, అసంకల్పితంగానో తమ ఆగ్రహావేశాల్ని ప్రకటిస్తున్నారు.

ఐదేండ్ల కొకమారు వచ్చే ఎన్నికలతో ముడిబెట్టి, ప్రభుత్వ విధానాలపై ప్రజల వ్యతిరేకతను బేరీజు వేస్తూ, అది ఏ పక్షానికి ఎంతవరకు ఎన్నికలలో లబ్ధిచేకూర్చుతుందనే లెక్కలు, అంచనాలకే సహజంగా పాలకవర్గ పార్టీలు పరిమితమౌతాయి. కూడు – గూడు – గుడ్డ – విద్య – వైద్యం వంటి ప్రజల మౌలిక సమస్యలపైనుండి ప్రక్కకు మరలకుండా నిలకడైన ఉద్యమాలలోకి ప్రజలను సమీకరించటం, కమ్యూనిస్టుల, విప్లవకారుల కర్తవ్యం. పాలకపక్షాల ఎన్నికల మాయోపాయానికి ఎరగాకుండా ప్రజలను నిలబెట్టటానికి, సమాజమార్పు ఆలోచనను వారిలో రగుల్కొల్పడానకి ఇదే మార్గాంతరం.

ooooo